కథానిక

# పంతులు చేసిన సహాయం

పి. వి. పల్లి

ఆవూరు లోకలుఫండురోడ్డుకి రెండుఫర్లాంగుల దూరంలోవుంది. సరిగ్గా పదోమైలురాయి దగ్గర దిగి పడమటగా పోవాలి. పట్నంనుండి యెప్పుడూ అధికార్లు వస్తూనే వుంటారా గ్రామానికి. పంతులుగారు ఆ వూరికి మిరాస్‌దారూ, చుట్టుపట్ల గ్రామాలకి రోడ్లువేయించే కంట్రాక్టరూ, వర్తకుడూ కూడాను. అందుచేత ఆయన మీద అనేకవిధమైన అభిమానమేర్పడేది అందరికీ అయితే ఆవూళ్లో బాగా నడుంవంగినవాళ్లు "పంతులుగారు పూటకికూడా గతిలేనివారే! అయినా యుద్ధంవచ్చిన దగ్గరనుండీ కంట్రాక్టుల్లోనూ ఆ తరవాత కంట్రోలుటైములో యితర విధాలయిన రాబడివల్లనూ పెద్దవాడయ్యా"డని అంటూండేవాళ్ళు. సరే యెలాగైతేనేం ఆయన ధనవంతుడయ్యాడు. ఆయన నడుస్తూంటే చిన్న ఏనుగుపిల్ల నడుస్తున్నట్లుంటుంది. చామనఛాయ, బోడ్డుమీసాలు, వెనకపట్టైడు పిలకముడి, అంతా ఖద్దరుమయం. బెంగాలీపంచకట్టు, మద్రాసు లాల్చీ, మెడలో యిరుప్రక్కలా మోకాళ్లకి దిగువవరకూ వ్రేలాడే ఎర్రంచులవాణీ—యివీ ఆయన అలంకారాలు. చేతిలో లావుపాటిబెత్తం. కాళ్ళకి కిర్రుచెప్పులు పంతులుగారి రాకని తెలియచేస్తాయి. ఆవూళ్లో సుబ్బన్న మధ్యతరగతి మనిషి. కులానికి షావుకారే అయినా వర్తకంలో అసమర్థుడే. యింతకీ కాఫీదుకాణం పెట్టేవుద్దేశం ప్రబలంగా వున్నది చేరువనేవున్న సిద్ధాంతిగారిదగ్గరికిపోయి ముహూర్తంపెట్టించుకొచ్చాడు కాఫీదుకాణం తెరవడానికి. తండ్రిముసలాడు. "నాయనా వెంకట్రావుపంతులుగారిచేత్తో తలుపులు తీయించు" అన్నాడు. ధనవంతుడిచెయ్యి అయితే తన దుకాణం రాణిస్తుందనీ, కాసీ పరకా మిగుల్తుందనీ అతని నమ్మకం.

ఇంతకీ యెక్కడ దుకాణం పెట్టడమో తెలీలేదు సుబ్బన్నకి. ముహూర్తం వారం దినాలుంది. తండ్రి ఆజ్ఞానుసారం వెంకట్రావు పంతులుగార్ని అడిగాడు. సలహాని పదిరూపాయలకి కొనుక్కున్నాడుసుబ్బన్న. ఉత్తనే చెప్పేరకంకాదు పంతులుది. రోడ్డుకి ఒడ్డునే సాల నిర్మించేడు. ఆసాలలో ఒకప్రక్క చిన్నస్టోరురూము. మిగిలినదంతా హాలు. రెండు పొడుగాటి బెంచీలు—వాటిముందు చిన్న బెంచీలు-అమర్చబడినయ్.

ఆనాడు ప్రారంభోత్సవదినం. రంగుల కాగితాలతో సాల అలంకరింప బడింది. ముందు పందిరకూడా వేయబడ్డది. పందిరకి "శ్రీ పరమేశ్వరీ విలాస్ కాఫీహోటల్" అన్నబోర్డు తగిలించబడ్డది. ఆరోజున అందరికి ఉచితంగా ఫలహారాలూ, కాఫీ యివ్వడానికి నిర్ణయించాడు సుబ్బన్న. పంతులుగార్ని సవినయంగా ఆహ్వానించాడు.

ఉదయం ఎనిమిదిగంటలకి ప్రారంభోత్సవం జరగాలి. పంతులుగారు రీవిగా నడుస్తూ హాల్లో అడుగు పెట్టారు. అంతా పంతులుగారికీ "జై" అంటూ నినాదాలు చేశారు.

ఇంకా యితర పెద్దలందరూ బెంచీలమీద ఆసీనులయ్యారు. పంతులుగారు టేబిలుముందున్న కుర్చీలో కూర్చున్నారు.

"పంతులుగారు మన కాఫీహోటలుని తెరవడానికి రావడం మన అదృష్టం" అన్నాడు సుబ్బన్న, చేతులునలుపుతూ. "ఆయన చేత్తో యేపనిచేసినా అది .యెంతో బాగావృద్ధిపొందుతుంది" అన్నాడు పంతులుగారి అనుయాయుల లోని ఒక పిలమనిషి.

పంతులుగారు మందహాసవదనారవిందులై—యిలా అన్నారు "నాలో ఏముందండి. మీలాంటివాణ్ణే నేనూను మీరు రమ్మన్నారుగనక వచ్చి ప్రారంభోత్సవం చెయ్యమన్నారు గనుక యివాళ కంట్రాక్టు తాలూకు బిల్లు మార్చవలసి వున్నా, పట్నం వెళ్ళకుండా వుండిపోయాను.

అసలు కాఫీహోటళ్లు మనదేశంలో అనాదినుండీవున్నవా? అనే ప్రశ్న నన్ను మొదటినుం

వేధించుతున్నది. అయితేనేం—యిప్పటికి ప్రతి గ్రామంలోనూ రెండుమూడు కాఫీహోటళ్ళున్నాయంటే అది నాగరికతకి ఒక ప్రబల నిదర్శనం. మన జాతియొక్క ఉజ్వలభవితవ్యం వీని మీదనే ఆధారపడివుంది. యింకా యిలాంటి కాఫీహోటళ్ళు విరివిగా వెలసి మన గ్రామానికి నూతన శోభని చేకూర్చాలి.

ఇంకా సుబ్బన్నని ప్రత్యేకంగా అభ్యర్థించేదేమంటే రుచిగల పదార్థాలని తయారు చెయ్యడం మంచి కాఫీని తయారుచెయ్యడం, శుచీశుభ్రం పాటించడం, వచ్చినవాళ్ళందరికీ సదుపాయాలు కలుగచెయ్యడం, యిలాంటివన్లో జాగ్రత్తగా వుండాలి ధరలు విషయంలో నామాటలేకుండా పెంచడం మంచిదికాదు. నా అజమాయిషీ వుండాలి. ఎప్పుడు ఏ విధమైన సహాకారం కావలసినా, నేను సిద్ధంగావున్నాను. నా శక్తిమేరకు సహాకరించగలనని హామీ యిస్తున్నాను—" అని వూరుకున్నారు.

"ఏం బాగా మాట్లాడారండీ పంతులుగారు" అన్నాడొక నడివయస్కుడు.

"మన నాయకులకి యేమాత్రం తీసిపోరు" అన్నారొక యువకుడు.

ఇంతట్లో సుబ్బన్న, అతని పదహారేండ్ల కొడుకూ రెండేసియిడ్లీలూ, ఇంత కొబ్బరిచెట్నీ తో కొత్త ప్లేట్లు వరుసగా తెచ్చి ఒక్కొక్కరిముందూ పెట్టారు. గాజుగ్లాసుల్లో నీళ్ళువుంచారు.

ఆతరవాత పెసరట్లు, గాజు గ్లాసుతో కాఫీ సప్లయిచెయ్యబడ్డాయి పంతులుగారికి అనంతరం మరో నాలుగు యిడ్లీలూ రెండు పెసరట్లూ మరోగ్లాసుడు కాఫీ సప్లయి చేయబడ్డాయి.

* * *

పంతులుగారి చేత ప్రారంభోత్సవం చెయ్యబడ్డందుకు సుబ్బన్నా, అతని తండ్రీ, అతని ఇతర బంధువులు మురిసిపోయారు. ఇంకా, ఎటువంటి సహాయమన్నా చెయ్యగలననిహామీ ఇచ్చినందుకు ఉప్పొంగిపోయారు. కొంత కాలందాకా పంతులుగారికి ఉచితంగా రెండు యిడ్లీలూ, కప్పు కాఫీ యివ్వడానికి నిర్ణయించుకున్నారు.

పదిహేనుదినాలుగడిచాయి. పంతులుగారితోపాటు అతని అనుచరులూ ఇతరులు మరో ముగ్గురూ [illegible]ంతున వస్తూండటం, వారందరికీకూడా ఉచితంగా టిఫిన్లూ, కాఫీలూ సప్లయి చెయ్యడానికి కష్టమనిపించింది సాహుకారికి.

"సుబ్బా-యీవరసేం బాగులేదు-" పంతులుగారు వెళ్ళినతరవాత అన్నాడు తండ్రి.

"ఏంచేస్తాం బాబూ అనుభవించడమే—"

"ఇలాగైతే మనం దుకాణం నడపలేం" అన్నాడు చిన్నవాడు, సుబ్బన్న కొడుకు.

"పోనీ యీసారి వాళ్లు వచ్చినప్పుడు పంతులుగారిదగ్గర డబ్బు పుచ్చుకోడంమాని, మిగతవాళ్ళ దగ్గర పుచ్చుకుందాం" నిర్ణయానికి వచ్చారు ముగ్గురూ.

* * *

"ఏమోయ్ సుబ్బన్నా-ఇవాళ యేమేమి ఫలహారాలున్నాయోయ్-" అంటూ లోపల అడుగు పెట్టారు పంతులుగారు. వెనకనుండి యేవరో యిద్దరు అధికార్లుకూడా వున్నారు. వాళ్ళ వెనకాల యిద్దరు బంట్రోతులూను.

సుబ్బన్న గుండె గుభేలుమంది ఇవాళ్ళ ఏ రెండురూపాయలదాకానో వృథాగా పోతాయి.

"ఇడ్లీ పెసరట్టు-గారెలు-" చెప్పుకుపోతున్నాడు సుబ్బన కొడుకు.

అయిదుగురూ బెంచీమీద కూచున్నారు.

"చూశారూ-ఆ పట్నంలో యేముందండీ బొంద అయితే టీఫిన్లు బాగావుంటాయి. అంతే యిక్కడ టిఫిన్లు యెంతో రుచిగా వుంటాయి. యీ పెసరట్టు చూశారూ..."

"అఁ...అలాగే చాలా బాగున్నాయి—" అన్నాడొక అధికారి. సుబ్బన్నప్రాణం ఉసూరుమంటున్నది. కొడుకు తనచేతి ఫలహారాలు బాగావున్నాయని పంతులు ప్రభృతులు పొగుడుతున్నందుకు ఉప్పొంగిపోయాడు.

"వస్తాను సాయంత్రం"...అంటూ సాల దాటిపోయాడు పంతులు.

ఏదో పెద్ద ప్రమాదంవచ్చి మీదపడ్డట్లనిపించింది సుబ్బన్నకి.

లోపలి గదిలోకివెళ్ళి చిట్టా చూచాడు. కాఫీహోటలు పెట్టిందగ్గరనుండి యిప్పటికి ఖర్చు వెయ్యిరూపాయిలు. అరువులక్రింద రెండువందల యాభై వుండిపోయినాయి. పంతులుగారిక్రింద అంటే వారి అనుచరులక్రింద ఖర్చుఅయినది డెబ్భైఆరు రూపాయిలు. పంతులుగారిదికూడా

కలుపుకుంటే శతమానానికి భర్తీ అయిపోతుంది. ఈ రహస్యం తండ్రితో చెప్పలేదు సుబ్బన్న. ఏదో పదో పాతికో అయివుంటుందనే అంటున్నాడు. ఆలోచించాడు యీ సొమ్ము యెలాగ తీసుకోవడమా అని.

పోనీ నేరుగా ఆయనదగ్గరకేపోయి అడుగుదామనుకున్నాడు. తీరా అడిగితే, అనుచరుల్ని అడగమంటాడేమో? వాళ్ళనడిగితే పంతులుగారిని అడగమంటారేమో? ఐతే యీ సొమ్ముకి తిలోదకా లివ్వడమేనా?—పంతులుగారిని ఎదిరించడం బహుకష్టం. ఊళ్ళో ఆయన ఆడింది ఆట, పాడింది పాట, ఆయన ధనమదాంధుడు. గ్రామాధికారి. అధికార్లే ఆయనదగ్గిర జడుస్తారు ఒక్కొక్కప్పుడు. యిక్కడికి వచ్చింతర్వాత, తిరిగి వాళ్ళు ఇళ్ళకి వెళ్ళిందాకా వాళ్ళప్రాణాలు భయపడుతునేవుంటాయి.

అయినా సుబ్బన్న తెగించాడు. కొడుకునీ, మరో నౌఖరునీ వెంటబెట్టుకుని పంతులుగారి గుమ్మం యెక్కాడొకనాడు సాయంత్రం.

పంతులుగారు చుట్టకాలుస్తూ - తన స్థూల కాయాన్ని యీజీచైర్లో చేరవేసి-ఆలోచిస్తున్నారు. గుమ్మంలో అడుగులచప్పుడయింది. తలెత్తి చూచారు పంతులుగారు.

"ఏమోయ్ - సుబ్బన్నా—యిలా వచ్చావ్. వాళ్ళెవరు?"

"చిత్తం—చిత్తం-మా వోడున్నూ, నౌఖరున్నూ."

"ఏదో పెద్దపనిమీదనే వచ్చివుంటావు. లేకపోలే రానేరావు."

"చిత్తంచిత్తం..." అన్నాడు సుబ్బన్న.

"తమదగ్గిరకే..." అన్నాడు కొడుకు.

"నాదగ్గిరకా?-యేం పని నాతో?" ఆశ్చర్యంగా అడిగాను.

"ఇప్పటికి డెబ్బయిఆరు రూపాయిలుకిపైగా అయిందండి" అన్నాడు నసుగుతూ సుబ్బన్న.

"అంటే?" ఏమీ యెరుగనట్లు, ఆశ్చర్యంగా అడిగారు పంతులుగారు.

"కాఫీ దుకాణానికి తమ పేరునవున్న ఖాతా సొమ్ము."

"అంతమట్టుకు నే నొక్కడినే తిన్నానటోయ్?"

"తమరూ—తమతోవచ్చిన..."

"ఆఁ...ఆఁ...ఆ సొమ్మంతా నామీద రుద్దుతావా?" నాకూ, ఆ సొమ్ముకీ ఏమీ సంబంధం లేదు. వాళ్ళదగ్గిరే వసూలుచేసుకో."

"వాళ్ళనడిగితే మిమ్మల్నే అడగమన్నారండీ- తమకి యిలాంటివి ఒక లెక్కలోనివిగాదు. ఇంత కన్న యెన్నో గట్లు, తెల్లోనదగ్గరనుండీ ఖర్చు పెడుతునేవున్నారు. మాబోటి బీదోళ్లని ఓ కంట చూడాలి..."

"అను. నీకొట్టుకి లైసెన్సువుందా?"

"చిత్తంచిత్తం"

"లైసెన్సులేకుండా గవర్నమెంటుని మోసం చేదామనుకున్నావా?"

"చిత్తంచిత్తం."

"రేపు పొద్దుటికి అక్కడ కొట్టువుంటే ఒప్పుకోను. లైసెన్సుచెల్లించితే వుంచుకోవచ్చు"

"చిత్తం-అలాగే కట్టేస్తా-మరి నా సొమ్ము?"

"ఛీ...ఛీ...అమాత్రానికి నాదగ్గిరకిరావాలా గ్రామాధికారిని పైగా కంట్రాక్టరుని-అపాటి గౌరవం వుంచక్కర్లా? అప్పుడు కోటాదారు మాత్రం నాదగ్గిర దమ్మిడీకూడా పుచ్చుకోకుండా అన్నీ సప్లయిచేసేవాడు" గద్దించారు పంతులుగారు.

గుమ్మం దిగిపోయాడు సుబ్బన్న. అక్కడ కొట్టుపెట్టుకోవడమే తప్పనుకున్నాడు.

కాఫీదుకాణం అచ్చి రాదని ఆవేళ అమ్మమ్మ చెపితే విన్నావా?" అన్నాడు కొడుకు.

---

దారిద్ర్యం, నిరంకుశపరిపాలన యీ రెంటివల్లా—పీడింపబడే వాళ్ళలో ఏమీ తేడాలేదు. నివారించడానికి మార్గాలున్నప్పటికీ దారిద్ర్యం పీడించే సమాజానికి స్వాతంత్ర్యం వుందనడం అసత్యం. ఏసమాజంలో అయితే అధిక సంఖ్యాకులు సాంఘికంగా పీడింపబడుతున్నారో ఆ సమాజంలో భావస్వాతంత్ర్యం కాని జాతి సామరస్యంగాని లభించవు.—(జెన్నీ లీ)